రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 21, దొండ 43, ఆలు 25, ఉల్లి 19, గోకర 50, దోస 18, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 40, అర్వి 57, మునగ 80, చిలగడదుంప 55, బీట్‌రూట్ 19, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో సోమవారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- **ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు...**
ఎల్‌బీసీ కాలనీ, న్యూ సైదాబాద్ పీఎస్, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, ఫరా కాలనీ, ఎల్‌సీహెచ్ కాలనీ, వాటర్‌ట్యాంక్, పూసలబస్తీ పరిసర ప్రాంతాలు
- **మధ్యాహ్నం 2 నుంచి సా.5 గంటల వరకు...**
లక్ష్మీనగర్ కాలనీ, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతి కాలేజ్, సంగం లక్ష్మీబాయ్ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన తెలిపారు.

రేపు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 6 న జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్(ఎస్‌వైఆర్)లో నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నందున నియోజకవర్గంలోని ప్రతి ముఖ్య నాయకుడు, కార్యకర్త, పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అవకాశం ఇస్తే పోటీ చేస్తా: మిద్దెల



మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జితేందర్

చంపాపేట: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే పోటీ చేస్తానని అని టీపీసీసీ సేవాదళ్, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి మిద్దెల జితేందర్ అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మిద్దెల జితేందర్ మాట్లాడుతూ... తాను 1982లో యూత్ కాంగ్రెస్‌లో సభ్యత్వం పొందానని, అప్పటి నుంచి రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేశానని అన్నారు. మహేష్‌కుమార్‌ను కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ సభ్యులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా శివచరణ్‌రెడ్డి



మన్సూరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీకి చెందిన జక్కిడి శివచరణ్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపులో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. తెలంగాణలోని 17 లోక్‌సభ సీట్లను గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేస్తున్నదన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం 2024 కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, పాల్గొన్న అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆర్.శివకుమార్, ఎస్.కే మాజిద్, సదానందం, పర్వతాలు.

– సాక్షి, సిటీబ్యూరో

అన్నదానం



హయత్‌నగర్‌కు చెందిన డాక్టర్ నగేష్, డాక్టర్ ప్రియాంక దంపతుల కుమారుడు ఆదిత్య అరుణాచలం పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం అమ్మానాన్న అనాథల పుణ్యక్షేత్రంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా అన్నదానం చేస్తున్నామన్నారు.

– హయత్‌నగర్

త్వరలో సుప్రీంకోర్టు తీర్పు

కాచిగూడ: కుల గణనపై తాను సుప్రీంకోర్టులో వేసిన కేసుపై త్వరలో తీర్పు రాబోతుందని, దీంతో దేశంలో బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ పోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుల గణనకు అనుకూలంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

రోడ్లపైకి నీరు వదిలితే కఠిన చర్యలు

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



పద్మావతి కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీ రోడ్లపైకి నీటిని వదిలితే జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, పద్మావతినగర్, రాగాల ఎన్‌క్లేవ్ కాలనీల్లో ఆయన ఆదివారం పర్యటించి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో కొందరు తమ ఇంటి ముందు నీటితో కడగడంతో పాటు రోడ్లపైనే వాహనాలను కడుగుతున్నారని అన్నారు. ఫలితంగా రోడ్లపై నీరు నిలిచి రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. అంతేకాకుండా నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారన్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చొరవ తీసుకొని ఇంటి ఎదుట నీటితో కడిగేవాళ్లకు అవగాహన కల్పించాలని కోరారు. అయినా లెక్క చేయకుండా ఎవరైనా రోడ్లపైకి నీరు వదిలితే జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానా విధిస్తారని, అంతేకాకుండా వాళ్ల ఇంటి ఎదుట చెత్తకుప్పలు వేయిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీల వాసులు విజయభాస్కర్‌రెడ్డి, కిషన్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'బస్తీ చలో అభియాన్'

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



ఎల్‌బీనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: రంగారెడ్డి అర్బన్ జిల్లాలో ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ 'బస్తీ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ చంద్రపురి కాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జాతీయ స్థాయి నాయకుడి నుంచి బూత్‌స్థాయి కార్యకర్త వరకు.. ప్రతి ఒక్కరూ బస్తీ చలో అభియాన్‌లో విధిగా పాల్గొనాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను పోలింగ్ బూత్‌లోని అన్ని వర్గాల ప్రజలను కలిసి వివరించాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను పెంపొందించిన విధానం, దేశాన్ని ఆర్థికంగా ఎలా అభివృద్ధి చేశారనే అంశాలపై ప్రజలకు తెలియజేస్తామన్నారు. గత ప్రభుత్వాలకు, ప్రధాని మోదీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరిస్తూ... మోదీ సారథ్యం మరోసారి కావాలని ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమ కన్వీనర్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కన్వీనర్ రుద్రారపు శంకర్, బొగ్గుల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బస్తీ చలో అభియాన్'ను విజయవంతం చేయాలి

– భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి

సైదాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు సోమవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు బీజేపీ బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భాగ్యనగర్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లోని 27 డివిజన్‌ల్లో బస్తీ చలో కొనసాగుతుందన్నారు. ఒక డివిజన్‌కు చెందిన 50 మంది సీనియర్ నాయకుల బృందం అదే నియోజకవర్గంలోని మరో డివిజన్‌లో పర్యటిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా చేసిన అభివృద్ధిని అక్కడి వారికి తెలియజేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ నాయకులు కోరతారన్నారు. రానున్న ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానంలో అసదుద్దీన్ ఒవైసీని ఓడించి బీజేపీ గెలవడం ఖాయమని సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

8న స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

నాగోలు: కోవే సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 8న నాగోలు డివిజన్ బండ్లగూడ, మధురానగర్ కాలనీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరుణగోపాల్ హాజరవుతారన్నారు.

తైక్వాండోలో బంగారు పతక విజేతకు సత్కారం



అభిరామ్‌ను సన్మానిస్తున్న మేజిస్ట్రేట్ సల్మాఫాతిమా

హస్తినాపురం: వనస్థలిపురం ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎన్వీ రమణ కుమారుడు, లా విద్యార్థి ఎన్.వెంకట అభిరామ్ రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. వెంకట అభిరామ్‌ను హయత్‌నగర్ మెట్రోపాలిటన్ కోర్టులో జడ్జి సల్మాఫాతిమా శాలువాకప్పి అభినందించారు. ఈ సందర్భంగా జడ్జి ఫాతిమా మాట్లాడుతూ, అభిరామ్ భవిష్యత్‌లో తైక్వాండోలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, సత్యనారాయణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

బీఎంఎస్ నుంచి ఏఐటీయూసీలో చేరిక



ఏఐటీయూసీలో చేరుతున్న ట్రాలీ ఆటో డ్రైవర్లు

నాగోలు: దేశ వ్యాప్తంగా ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై కార్మికులు పెద్ద సంఖ్యలో ఏఐటీయూసీలోకి చేరుతున్నారని తెలంగాణ ట్రాలీ ఆటో డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.చందు అన్నారు. ఆదివారం నాగోలు బీఎంఎస్ సంఘానికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్లు 10 మంది ఏఐటీయూసీ ఆటో ట్రాలీ డ్రైవర్ల యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1962లో హైదరాబాద్‌లో మొట్టమొదటి ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అప్పటినుంచి ఇప్పటివరకు ఆటో, ట్రాలీ, రిక్షా, కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వారికి న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని వారు ఆటో డ్రైవర్లను కోరారు. సమావేశంలో సీపీఐ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎండీ షైమీద, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాగోల్ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు మహేందర్, సేవియా నాయక్, ఆటో యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లయన్ సామ్రాట్ పద్మశాలి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్, డైరీని కందగట్ల స్వామి ఆవిష్కరించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల, ఇంజినీర్ విభాగం జాతీయ అధ్యక్షుడు పుట్ట పాండురంగయ్య, కత్తుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి సుధాకర్ గాందే

కాచిగూడ: ప్రముఖ వ్యాపారవేత్త సుధాకర్ గాందే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. సుధాకర్ గాందేకు బీజేపీ కండువా కప్పి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. సామాజిక సేవలో ముందుండే సుధాకర్ తమ పార్టీలో చేరడం సంతోషకరమన్నారు.

అగ్రికల్చర్ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తా..



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రమోహన్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ఆదివారం అగ్రికల్చర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డిలు తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాతా నాయక్ మాట్లాడుతూ, డివిజన్‌లోనే అతిపెద్ద కాలనీ కావడంతో జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు కల్పిస్తామన్నారు. కాలనీలో రెండు విడతలుగా రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఈ స్థాయికి..

● త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

కాచిగూడ: 'మీ అందరి ఆదరాభిమానాలు, ప్రోత్సాహంతోనే గవర్నర్ అయ్యా' అని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. భారత్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడ భారత్ కళాశాలలో ఇంద్రసేనారెడ్డి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 8వ తరగతి చదువుతున్నప్పుడే ఆర్‌ఎస్‌ఎస్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు అనుసరిస్తూ బీజేపీలో పని చేస్తున్నానని తెలిపారు. గతంలో అనేకసార్లు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినా ఫలితం లేదన్నారు. త్రిపుర గవర్నర్‌గా నియమితులైనట్లు టీవీల్లో వార్తలు చూసే వరకు తనకే తెలియదని చెప్పారు. తనను గుర్తించి గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించిన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, రేణుక రెడ్డి, సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్.హరినాథ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, పుట్ట పాండురంగయ్య పాల్గొన్నారు.



ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం



స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

హస్తినాపురం: విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, ప్రతినిత్యం విద్యార్థులు యోగా, వ్యాయామం చేయడం ద్వారా పిల్లల్లో మంచి ఎదుగుదల ఉంటుందని బొబ్బిలి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని దేవకమ్మ తోటలో భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆపార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఆదివారం డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ అధ్యక్షతన శక్తి కేంద్రం ఇన్‌చార్జీల సమావేశం జరిగింది. సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలని సూచించారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ మరింతగా బలోపేతం చేయడానికి సమష్టిగా ముందుకు కదలాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, సురేందర్, కొంగర ప్రవీణ్, లక్ష్మారెడ్డి, అంబాబాయి, గణేష్, శ్రీనివాస్, ఉదయ్, పరుశరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న చంద్రశేఖర్‌గుప్తా, ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాసవి కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా అన్నారు. ఆదివారం వాసవి కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ నడకతో పాటు వ్యాయామం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఆసుపత్రి సీఓఓ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 300 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ రామదాసు, కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రామదాసు అన్నారు. సిండికేట్ బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఓమ్ని, అపోలో ఆసుపత్రి వైద్యులు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందజేశారు. మధుమేహం, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి మల్లేశం, జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, మొగిలి శివరాం, షేక్ ఉమర్, టింకు, వంశీ, రాము పాల్గొన్నారు.

నో ఎంట్రీ సమయంలో మినీ టిప్పర్లను అనుమతించాలి



కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మినీ టిప్పర్లు, ట్రాక్టర్ల సిబ్బంది

చంపాపేట: నగర శివార్ల నుంచి మట్టి, కంకర, డస్ట్ లోడ్‌తో వచ్చే మినీ టిప్పర్లు, ట్రాక్టర్లకు నో ఎంట్రీ సమయమైన ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వాలని నగర రేణుకా ఎల్లమ్మ మినీ టిప్పర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో మినీ టిప్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, భారీ వాహనాలతో పాటు తమ వాహనాలను కూడా రాత్రి 10 నుంచి ఉదయం ఏడు గంటల వరకు మాత్రమే నగరంలోకి ప్రవేశించాలని ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించటంతో అర్ధరాత్రి వేళల్లో కూలీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పగటి వేళ నగరంలో ప్రవేశించే మినీ టిప్పర్లు, ట్రాక్టర్ల డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు వేధింపులకు గురి చేయటమే కాకుండా భారీగా చలాన్లు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, సంబధిత అధికారులు వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వెంకన్న, బాలరాజు, నాగరాజు, శ్రీకాంత్, జితేందర్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ విడుదలకు డిమాండ్

కాచిగూడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని డీవైఎఫ్‌ఐ నగర కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్ల రద్దయిన గ్రూప్ 1 పరీక్షలను తిరిగి నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ కోసం తక్షణమే డీఎస్సీ విడుదల చేయాలన్నారు.అప్పటి వరకు నిరుద్యోగ యువతకు రూ.5 వేలు భృతి ఇవ్వాలన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎండీ జావేద్, హస్మీ, శృతి, అనిల్, రవి పాల్గొన్నారు.